# జీవితమే ఒక జీడిపాకం



ఎమ్.డి.యస్దాన్

"ఒరేయ్ చైతూ... టెలివిజన్‌ను కనిపెట్టింది ఎవర్రా?" లంచ్ అవర్‌లో తన కొలీగ్ చైతన్యను అడిగాడు సుందర్.

"నువ్వు జీ.కే.లో మరీ యింత పేదవాడివేంటా?" విసుగ్గా అన్నాడు చైతన్య.

"ఔన్నా... నేను జీ.కే.లో పూర్‌నే. నిన్న కే.బి.సిలో బిగ్ బి ఈ క్వశ్చన్ అడిగాడు. దాని ఆనర్స్ చెప్పే జంట తంటాలు పడుతుంటే నేను ఆసక్తిగా చూస్తున్నాను. ఇంతలో మీ చెల్లెమ్మ వచ్చి-"

"అవతల మనుషుల ప్రాణాలు పోతుంటే మీకు కే.బి.సి కావాల్సొచ్చిందా?" కళ్ళొత్తుకుంటూ అడిగింది.

అదిరిపడ్డాను నేను "ప్రాణాలు పోతున్నాయా! ఎవరివీ?" ఆశ్చర్యంగా అడిగాను.

"నిన్న శివుడు ఆవేశంతో గంగను కాల్చేశాడండి ఏమైందో ఏమో" విచారంగా అంది.

"గంగా...!గంగెవరూ?"

"గంగెవరో తెలీదా?" నన్నో వెధవను చూసినట్లు చూసి దీర్ఘంగా నిట్టూర్చి "గంగా మంగమ్మ గారి మనవరాలండి" అంది.

మళ్ళీ అదిరిపడ్డాను నేను.

"ఈ మంగమ్మ ఎవరు? మా తాలూకా మీ తాలూకా?"

"తాలూకా కాదు మండలమూ కాదు ముందు మీరు టీ.వీ ముందు నుంచి జరగండి" అంటూ ఛానెల్ మార్చింది.

టీ.వీ తెర మీద లెటర్స్ పడుతున్నాయి. సైడు నుంచి ఈ పాట వస్తోంది.

"పాడు బడిన బావివమ్మా నీవు... కప్పలు లేని చెరువువమ్మా నీవు... నీ బ్రతుకే ఒక జీడిపాకంగా రాశాడమ్మా ఆ బ్రహ్మ".

"ముందా టీ.వీ కట్టేయవే... ఆ పాట వింటుంటే నాకు వాంతి వచ్చేట్టుంది.

భయంగా అన్నాను నేను.

"వాంతి వస్తే వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళండి. నేను మాత్రం టీ.వీ కట్టేయను" మొండిగా అంది.

"నీకేంపోయే రోగం వచ్చిందే? యింకొంచెం సేపు ఆపాట వింటే చెవుల్లో నుంచి రక్తం వచ్చేట్లుంది" అంటూ చెవులు మూసుకున్నాను.

"అంతేలేండి మగవాళ్ళది మనసు కాదు! కఠిన శిల. మా ఆడవాళ్ళ కష్టాలు మీకేం తెలుస్తాయి. పాపం ఆ గంగకు ఏమైందోనన్న బెంగతో మన కాలనీలోని ఆడవాళ్ళందరూ రాత్రంతా నిద్రపోలేదు తెలుసా మీకు?" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

"అలా ఏడవకే యింతకు ఆ గంగెవరో చెప్పవే" నీరసంగా అడిగాను.

పైట కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ... "గంగా తబలారావుకు తల్లండి" అంది.

"తబలారావా!వాడెవడూ?"

ఈసారి నాపైపు కోపంగా చూసింది. "మీదేం

బుర్రండి ఎంత చెప్పినా అర్థం కాదు. గడబిడరావుకూ గంగకూ పుట్టిన వాడే తబలారావు. గంగను తనకు కాదని గడబిడరావు కిచ్చి పెళ్ళి చేసిందన్న కోపంతో శివుడు పిన్నీసుతో గుచ్చి మంగమ్మను చంపేశాడు! అతన్ని పోలీసులు పట్టుకెళ్ళినప్పుడే మన పెళ్ళి జరిగింది తెలుసా? పధ్నాల్గేళ్ళ శిక్ష పూర్తవడంతో మొన్న అతన్ని జైలు నుంచి విడుదల చేశారు".

"మన పెళ్ళి జరిగినప్పుడు జైలుకు వెళ్ళాడన్నావు మన పెళ్ళి జరిగి పదేళ్ళే కదా అయింది. అతనికి పధ్నాల్గేళ్ళ శిక్ష ఎలా పూర్తయిందే?"

"అబ్బా మీరు మరీనండి. పధ్నాల్గేళ్ళంటే మరీ పధ్నాల్గేళ్ళు చూపిస్తారా? ఏదో సింపుల్‌గా ఆ ఘట్టాన్ని ముగించారు. ఈలోపల గంగకు బాబు పుట్టడం, వాడు పుట్టినప్పుడు ఆ సీరియల్‌ను తాజ్‌మహల్ టీ స్పాన్సర్ చేస్తుండటంతో వాడికి తబలారావు అని పేరు పెట్టారు.

"సీరియల్లా! ఇదంతా నువ్వు టీ.వీ సీరియల్ గురించా చెప్పడం!"

"అవునండి మెగా హిట్ సీరియల్ జీవితమే ఒక జీడిపాకం గురించి. అదిగో చూడండి వచ్చేసింది" ఉత్సాహంగా అంటూ టీ.వీ తెరకు అతుక్కుపోయింది.

నేను ఆసక్తిగా చూడసాగేను.

"రీకాప్" అంటూ ఏదో కొన్ని పిచ్చి బిట్లు చూపించిన తరువాత ఒక చింపిరి జుట్టు వ్యక్తి వచ్చి అగ్గిపుల్ల వెలిగించాడు. ఎవరో మహిళ కెవ్వున అరిచింది. "బ్రేక్" అంటూ తెరమీద వాణిజ్య ప్రకటనలు ప్రత్యక్షం అయ్యాయి.

"ప్చ...! అంటూ నా భార్య లావణ్య నీరసంగా నిట్టూర్చింది.

యింతలో మా పిడుగు- అదే పుత్రరత్నం వచ్చి-

"అవతల మన దేశం పరువు మంటగలిసి పోతుంతే మీరిద్దరూ తీరిగ్గా టీ.వీ సీరియల్స్ చూస్తున్నారా?" కోపంగా అడిగాడు.

"అదేంట్రా సారే జహా సే అచ్ఛా అయిన మనదేశం పరువు పోవడం ఏమిటి? నీకేం పిచ్చెక్కలేదు కదా?" అనుమానంగా అడిగాను నేను.

"ఔను డాడీ మన సిప్పర్ స్లిప్‌లో మూడు క్యాచ్‌లు స్లిప్ చేయడంతో శ్రీలంక సింపుల్‌గా అరవై పరుగులకు ఆలౌట్ అయింది.

"యింత మంచి విషయం చెప్పి పరువు మంటగలిచిపోయిందంటావేంట్రా పిచ్చి సన్నాసి".

"తొందరపడి తిట్టకు డాడీ ఒక్కసారి స్పోర్ట్స్ ఛానెలల్ పెట్టి చూడు సీన్ అర్థం అవుతుంది" అన్నాడు.

"ఏది స్పోర్ట్స్ ఛానెల్ పెట్టు మ్యాచ్ చూద్దాం" మనదేశం ఎన్ని వికెట్ల తేడాతో గెలిచిందో".

"ఏంటీ గెలిచేదీ? ఆరు రన్సు తొమ్మిది వికెట్సు".

"నిజమా! ఏది చూడనీ" అంటూ ఛానెల్ మార్చబోయాను. కానీ నా భార్యామణి ఆడ సైంధవుడిలా అడ్డొచ్చి-

"నా జీడిపాకం పూర్తయ్యేవరకూ నేను ఛానెల్ మార్చనివ్వను".

"జీ.జీ పాకమా! అదేంటి?"

"జీవితమే ఒక జీడిపాకంను షార్ట్‌కట్‌లో మమ్మీ అలా పిలుస్తోంది డాడీ. అయినా నీ పిచ్చి కానీ నేను పక్కింటి నుంచి వచ్చి అయిదు నిమిషాలు అయింది. యింకా ఆ ఒక్క వికెట్టు వుంటుంది?" ఎప్పుడో ఎగిరిపోయి వుంటుంది.

ఆ సీరియల్స్ చూసే మన మమ్మీకు ఉన్నంత ఓపిక మన క్రికెటర్స్‌కు వుండి వుంటే మన జట్టుకు తిరుగుండదు కదా? ఏం చేద్దాం బ్యాడ్ లక్" అంటూ వాడు వేదాంతిలా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

"నేను ఈ గొడవల్లో పడి కే.బి.సి గురించి పట్టించుకోలేదు. అందుకని టెన్షన్‌గా వుంది చెప్పరా! టెలివిజన్‌ను కనిపెట్టింది ఎవరు? అడిగాడు సుందర్.

"నీకంటే ఎక్కువ టెన్షన్ నాకుంది. యింతకు ఆ జీ జీపాకం తరువాత ఏమైంది. శివుడు గంగను కాల్చేశాడా? గంగ వుందా పోయిందా?" ఆత్రంగా అడిగాడు చైతన్య.

"ఏంట్రో నీకు కూడా ఈ సీరియల్స్ పిచ్చి వుందా?"

"నాకు లేదు కాని మీ ఆవిడలాగే మా ఆవిడకూ ఆ సీరియల్స్ అంటే తగని ఇష్టం. ఆ సీరియల్ వచ్చే టైమ్‌లో కూరమాడిపోతున్నా, చీర జారిపోతున్నా పట్టించుకోదు. కానీ నిన్న రాత్రి సరిగ్గా ఆ సీరియల్ వచ్చే టైమ్‌లో మా ఏరియాలో పవర్ కట్ అయింది. కరెంట్ ఆఫీసుకు ఫోన్ చేసి తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది. అయినా లాభం లేదు. మొత్తానికి నిన్నటి ఎపిసోడ్ మిస్ అయింది.


తెలిసిన వాళ్ళందరికీ ఫోన్లు చేసి సీరియల్ గురించి ఆరా తీసింది. బట్ బ్యాడ్‌లక్ నిన్న వాళ్ళందరూ కే.బి.సి., క్రికెట్ చూస్తూ వుండటం వల్ల సీరియల్ చూడలేకపోయామని చెప్పి తప్పించుకున్నారు.

రాత్రి నుంచి పచ్చి మంచి నీళ్ళైనా ముట్టుకోలేదు. కరెంటు వాళ్ళను శాపనార్థాలు పెడుతూ కూర్చొని వుంది. అందుకుని అడిగానంతే".

వేదాంతిలా నవ్వాడు సుందర్.

"చెప్పరా ప్లీజ్ ఎంతనైనా ఆమె నా భార్య కదా? ఆమె బాధపడితే చూడలేకున్నాను. అందుకని ఆ సస్పెన్స్ ఘట్టాన్ని నీ నోటితో విని నా నోటితో ఆమెకు చెప్పాననుకో నా నోటికో మంచి బహుమతి దక్కుతుంది" బతిమాలాడు చైతన్య.

"ఈ వెర్రి ఆడవాళ్ళను టెన్షన్ పెట్టడం కోసం ఆ జీ.జీ.పాకం డైరెక్టరు చాలా మంచి ట్రిక్కు చేశాడ్రా! శివుడు తను వెలిగించిన అగ్గిపుల్లతో బీడీ ముట్టించుకున్నాడు. గంగ తన వంట పాత్ర మీద పడ్డ బల్లిని చూసి కెవ్వున అరిచింది. ఇది తెలియని ఈ వెర్రోళ్ళు మాత్రం టెన్షన్‌తో చచ్చారు"



అంటూ పెద్దగా నవ్వేశాడు సుందర్.

చైతన్య కూడా తేలిగ్గా వూపిరి పీల్చి నవ్వాడు. "సరే యింతకు ఆ మహానుభావుడి పేరేంటో చెప్పరా" కుతూహలంగా అడిగాడు సుందర్.

"అతని పేరు జాన్ లాగి బెయర్డు. ఎ.కె.47ను కనిపెట్టినతను తను ఈ వెపన్‌ను ఎందుకు కనిపెట్టానా అని తీరిగ్గా బాధ పడ్డాడట! ఇప్పుడు వస్తున్న ఈ సీరియల్స్ చూసి పిచ్చోళ్ళు అయిపోతున్న మన భార్యలను చూస్తే ఆ బెయర్డ్ మహాశయుడు మరెంత బాధపడతాడో" దీర్ఘంగా నిట్టూర్చాడు చైతన్య.

* * *

సాయంత్రం ఆఫీసు నుంచి తన బైక్ మీద ఇంటికి వస్తున్నాడు చైతన్య. దారిలో ఒక చోట ట్రాఫిక్ జామ్ అయి గొడవ గొడవగా వుంటే బైక్‌ను ఆపాడు.

చాలా మంది వ్యక్తులు కేబుల్ వైర్లను పీకి తగులబెడుతున్నారు. చూస్తుంటే గూండాల్లా వున్నారు. అడ్డు వచ్చిన వాళ్ళను కొడుతున్నారు.

అక్కడి జనం మంచి వయలెన్స్ సినిమా చూసినట్లు అక్కడి సమావేశాన్ని చూస్తున్నారు.

రౌడీలన్నా రౌడీజమన్నా అస్సలు గిట్టని చైతన్య వెంటనే కలుగజేసుకున్నాడు.

"ఎవరయ్యా మీరు? ఏమిటీ దౌర్జన్యం పోలీసులను పిలవమంటారా?" ఆవేశంగా బైక్ దిగి అడిగాడు.

ఆ గుంపులో నుంచి పొట్టిగా బట్టతలతో వున్న ఒకతను కాలర్లు మడుచుకుంటూ చైతన్య ఎదురుగా వచ్చి-

"పిలవండి సార్! సమాజంలో నుంచి ఏరిపారెయ్యాల్సింది మాలాంటి రౌడీలను కాదు, ఈ కేబుల్ వైర్లనని వాళ్ళతో చెప్పండి" అన్నాడు.

"అదేంటయ్యా ఈ వైర్లు మీకేం అడ్డం కొంపదీసి మీరు లారీ డ్రైవర్ల? ఇవి మీ రూటుకి అడ్డువస్తున్నాయని..." చైతన్య మాట పూర్తి చేయనే లేదు. ఆ పొట్టి బట్టతల వ్యక్తి కలగజేసుకుని-

"లారీ డ్రైవర్లనైతేనేమి... ఆటో డ్రైవర్లనైతేనేమి ఇవి అందరి జీవితాల్లో చీకటిని నింపాయి సార్. అసలు ఇవి వైర్లు కాదు సార్, మన మగవాళ్ళకు చుట్టుకున్న వురితాళ్ళు" ఆవేశంగా అన్నాడు.

"అదేంటయ్యా అంతగా బాధపడిపోతున్నావు యింతకూ ఏం జరిగింది?"

"ఏం జరగలేదని అడగండి సార్! మీరెవరో మంచి వారిలా వున్నారు. చదువుకున్న వారిలా వున్నారు. అందుకే మా కష్టం ఈ అందరి తరుపు

## సగటు మనిషి

కరెంటు పోతే -
మొదట
దీపం వెలిగించాలి కదా!
కాదు -
పక్కింట్లో తొంగిచూస్తారు
వారికి ఉందా లేదోనని!

**- ఈతకోట సుబ్బారావు**

నుంచి మీతో చెబుతున్నాను సార్. విని మీరే చెప్పండి మేము చేస్తున్న రైటో, రాంగో" అంటూ చెప్పనారంభించాడా వ్యక్తి.

"యింతకు ముందు ఇంటికి వెళితే భార్య నవ్వుతూ ఎదురొచ్చి పలకరించేది. కొసరి కొసరి బువ్వ తినిపించేది. పిల్లలు అల్లరిగా చుట్టు ముట్టేవాళ్ళు కానీ, ఇప్పుడో అదంతా గతమైపోయింది.

ఇప్పుడు మంచి మాటా లేదు చిలిపి కబుర్లు లేవు. అస్తమానం ఆ సీరియల్స్ అంటు టీ.వీ ముందు కూర్చొని మా బ్రతుకుల్నే నరకం చేస్తున్నారు సార్!

ఇంతకు ముందు మా ఆవిడ చేతివంట అమృతంలా ఉండోది ఇప్పుడు గరళానికి పోటీ పడుతోంది.

చెప్పకూడదు కానీ, పగలంతా కష్టపడి రాత్రి తాపంతో దగ్గరకు వెళితే- వుండు మావ అసలే ఆ సీరియల్లో ఆ ఇద్దరికీ పెళ్ళవుతుందో లేదోనని నేను బుర్ర బద్దలు కొట్టుకుంటుంటే మధ్యలో నీ గొడవేంటి! అంటూ కసురుకుంటోంది సార్.

కాలక్షేపం కోసం మా ఇళ్ళల్లోకి ఈ వైర్లను ఆహ్వానించాము సార్ కానీ ఇవి కాలకూట విషాలై మా బ్రతుకుల్ని నాశనం చేశాయి.

ఇప్పుడు చెప్పండి సార్ మేము చేస్తున్నది తప్పా? తప్పని ఎవరన్నా చెబితే మా ఛాలెంజ్ వాళ్ళను కుర్చిల్లో కట్టేసి, అడ్డమైన సీరియల్స్ అన్నీ హోల్‌సేల్‌గా చూపిస్తాము. దాంతో ఆ చూసిన వాడు పిచ్చెక్కి ఈ కేబుల్ వైర్లనే మ్రింగి ఆత్మహత్య చేసుకుంటాడు" రొప్పుతూ తన ప్రసంగం ఆపి మళ్ళీ తన పనిలో నిమగ్న మయ్యాడా వ్యక్తి.

చుట్టూ చేరి వున్న జనమంతా ఆ వ్యక్తి మాటలకు పెద్దగా చప్పట్లు కొట్టారు.

ఆ వ్యక్తి ఏదో గుర్తుకు వచ్చిన వాడిలా మళ్ళీ చైతన్య వద్దకు వచ్చి తన జేబులో నుంచి ఒక ఫోటో తీసి చూపించి-

"చూడండి సార్ ఈ ఫోటోలోని వ్యక్తి ఎలాగున్నాడు?" అడిగాడు.

చైతన్య ఆ ఫోటోవైపు పరిశీలనగా చూసి,

"చాలా బాగున్నాడు. ఎవరితను మీ అబ్బాయా?" అడిగాడు.

ఆ బట్ట తల వ్యక్తి విరక్తిగా నవ్వి-

"కాదు సార్ నేనే ఆ పిచ్చి వైర్లు మా కిటికీల్లో నుంచి మా ఇంట్లోకి రాక మునుపు ఇలా వుండేవాడ్ని ఇప్పుడు ఇలా అయ్యాను" బాధగా అన్నాడు.

చైతన్య మౌనంగా ఇంటి దారి పట్టాడు.

* * *

ఇంట్లోకి అడుగుపెడుతూనే చైతన్య భార్య రంజిత కేబుల్ టీ.వీ రావడం లేదంటూ గగ్గోలు పెడుతోంది. ఆమెని గమనించకుండా చైతన్య ముసి ముసి నవ్వులు నవ్వుకున్నాడు ఆనందంగా.

